ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్

కావలి రైల్వేస్టేషన్‌లో సమస్యలు హాల్ట్

- నిరుపయోగంగా మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు
- వెయిటింగ్ హాల్ తెరిస్తే ఒట్టే
- ప్లాట్‌ఫామ్‌లపై కనిపించని డస్ట్‌బిన్లు
- పెదవి విరుస్తున్న ప్రయాణికులు




నత్తనడకన సాగుతున్న లిఫ్ట్ పనులు


ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎక్కలేక పట్టాల మీదుగా వెళ్తుతున్న వృద్ధులు

స్టేషన్ బయటే మల,మూత్ర విసర్జనలు


స్టేషన్‌లో మరుగుదొడ్లు ఉన్నా నిరుపయోగంగా మారాయి. వాటికి ఎప్పుడూ తాళం వేసి ఉంటుండడంతో ప్రయాణికులు మల,మూత్ర విసర్జనలకు స్టేషన్ బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉక్కపోతతో అల్లాడాల్సిందే..


స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. కనీసం షెడ్‌ల కింద కూడా ఫ్యాన్లు లేకపోవడంతో రైలు వచ్చే వరకు ప్రయాణికులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

కావలి: దక్షిణమధ్య రైల్వేలో విజయవాడ డివిజన్ పరిధిలో ఉన్న కావలి రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. స్టేషన్ ద్వారా ఆదాయం బాగా లభిస్తున్నా ప్రయాణికులకు సౌకర్యాల కల్పనలో రైల్వే శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. తాగునీరు, మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతులు, కీలకమైన రైళ్లకు స్టాపింగ్, తదితర సౌకర్యాలను కల్పించడంలో విఫలమవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వర్షం వస్తే తడవాల్సిందే..


కావలి రైల్వే స్టేషన్‌లో ఐదు ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. 1,2,4,5 ప్లాట్‌ఫామ్‌లపై అరకొరగా షెడ్‌లు ఉన్నాయి. 3వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై కొంత భాగం నీడను కల్పించేందుకు షెడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు ప్రధాన ద్వారం ఉంది. అక్కడే టికెట్ కౌంటర్ ఉంది. అక్కడి నుంచి స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా ఇతర ప్లాట్‌ఫామ్‌లకు చేరుకోవాల్సి ఉంటుంది. అయితే టికెట్ కౌంటర్ నుంచి మెట్ల వరకు షెల్టర్ లేకపోవడం..బ్రిడ్జికి అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో వర్షం పడే సమయంలో ప్రయాణికులు తడిసి ముద్దవుతున్నారు. స్టేషన్‌కు పడమటి వైపున టికెట్ కౌంటర్ లేదు. దీంతో ఉదయగిరి బ్రిడ్జి వైపు నుంచి వచ్చే ప్రయాణికులు ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లి టికెట్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

50 రైళ్లకే స్టాపింగ్

జిల్లా కేంద్రమైన నెల్లూరు తర్వాత పెద్ద పట్టణమైన కావలిలో సుమారు 2.5 లక్షల మందికిపైగా జనాభా నివాసం ఉంటున్నారు. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని సుమారు 500 గ్రామాలకు చెందిన పదివేల మందికి పైగా ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం కావలికి రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కావలి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తమ గమ్య స్థానాలకు చేరుకుంటుంటారు. కావలి రైల్వే స్టేషన్ మీదుగా సుమారు 500 రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ కావలిలో కేవలం 50 రైళ్లకు మాత్రమే స్టాపింగ్ ఉంది. కావలి మీదగా రాకపోకలు సాగించే మరో పది రైళ్లకు స్టాపింగ్ కల్పించే పరిస్థితులు ఉన్నప్పటికీ రైల్వే శాఖ ఉదాశీనత వైఖరితో ఆ భాగ్యం కలగడం లేదు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు, ఒంగోలు స్టేషన్లకు చేరుకుని అక్కడి నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

భారీగా ఆదాయం ఉన్నా..

కావలి రైల్వే స్టేషన్ ద్వారా ఏడాదికి సుమారు 11లక్షల మందికిపైగా ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుకుంటుంటారు. ప్రయాణికుల ద్వారా ఏడాదికి సుమారు రూ.12 కోట్ల మేర ఆదాయం సమకూరుతోంది. సరుకు రవాణా ద్వారా మరో రూ.2కోట్ల మేర రాబడి వస్తోంది. పరిమిత రైళ్ల స్టాపింగ్ ద్వారానే కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా ఆ మేరకు ప్రయాణికులకు సౌకర్యాల కల్పనలో రైల్వే శాఖ శీతకన్ను చూపడంపై విమర్శలు వస్తున్నాయి.

నో వెయిటింగ్


రైల్వే స్టేషన్‌లో పురుష, మహిళా ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్రత్యేకంగా హాళ్లు ఉన్నాయి. వాటికి ఎప్పుడూ తాళం వేసి ఉంటుండడంతో ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌లపైనే నిరీక్షించాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో మహిళా ప్రయాణికులకు భద్రత కరువవుతోంది.

అలంకారప్రాయంగా కుళాయిలు


రైల్వేస్టేషన్‌లో ఐదు ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. వాటిపై మంచినీటి కుళాయిలు అలంకారప్రాయంగా మారాయి. కుళాయిల్లో చుక్కనీరు రాకపోతుండడంతో ప్రయాణికులు దాహంతో అల్లాడుతున్నారు. కొందరు చేసేదిలేక వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసి గొంతు తడుపుకొంటున్నారు.

నో ఎంక్వైరీ



స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు రైళ్ల రాకపోకల సమాచారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన విచారణ కౌంటర్ ఎప్పుడూ మూసేఉంటోంది. ఏదైనా సమాచారం అవసరమైన ప్రయాణికులు అక్కడ విధుల్లో ఉన్న రైల్వే సిబ్బందిని సంప్రదిస్తే మమల్ని అడగొద్దంటూ కసురుకుంటున్నారు.

ప్యాసింజర్ రైళ్లను పొడిగించాలి


చెన్నై–నెల్లూరు మధ్యన తిరిగే ప్యాసింజర్ రైళ్లను కావలి వరకు పొడిగించాలి. దీనివల్ల నెల్లూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే కావలి ప్రాంత ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

–టీవీఎంఎస్ ప్రకాష్‌రావు, కార్యదర్శి, రైల్ అండ్ రోడ్ ప్యాసింజర్స్ అసోసియేషన్, కావలి

సౌకర్యాలను కల్పించాలి


హైదరాబాద్ –త్రివేంద్రం మధ్య తిరిగే శబరి ఎక్స్‌ప్రెస్‌కు కావలిలో స్టాపింగ్ ఇవ్వాలి. కావలిలో పలు రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని కావలి వ్యాపారులు ఎన్నోసార్లు రైల్వే అధికారులకు అర్జీలు అందజేసినా ఫలితం లేదు. గ్రామ పంచాయతీ అయిన సింగరాయకొండలో ఆగే రైళ్లకు కూడా కావలిలో స్టాపింగ్ లేకపోవడం బాధాకరం. స్టేషన్‌కు పడమటి వైపున టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్టేషన్‌లో వసతుల కల్పన, రైళ్ల స్టాపింగ్‌కు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కూనం తాతిరెడ్డి, కావలి

క్లుప్తంగా

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


సంగం: మండలంలోని గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన వై పెంచలయ్య తన తల్లి యాటగిరి శేషమ్మ జ్ఞాపకార్థంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన అవినాష్, ముఖేష్, ఆసీఫాకు రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు అందజేశారు. హిందీలో 98 మార్కులు సాధించిన ఆసీఫాకు హిందీ ఉపాధ్యాయుడు మధు రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు.

గండ్లవేడులో వైద్యశిబిరం


ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి అనూషాకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారులు సైదా, సుప్రియ, ఏఎన్ఎం భూదేవి, ఎంపీహెచ్ఏ కృష్ణారెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి


ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలో మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏపీఎస్) నాయకులు కోరారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ మధులతకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మర్రిపాడు, రేవూరు గ్రామాల్లోని సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని విన్నవించారు. వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఎస్ కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, తిరుమల, ఆదిత్య, ఆశిష్, శ్రీను, ఆశిక్, తదితరులు పాల్గొన్నారు.

కంటి స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన


సంగం: మండల విద్యావనరుల కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి స్క్రీనింగ్ పరీక్షలపై ప్రధానోపాధ్యాయులకు శనివారం అవగాహన కల్పించారు. కంటి వైద్యనిపుణులు శ్రీలేఖ విద్యార్థుల్లో తలెత్తే హస్వదృష్టి, దీర్ఘదృష్టి, గ్లకోమా, కండ్లకలక, తదితర సమస్యలపై అవగాహన కల్పించారు. త్వరలో పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు, కంటి అద్దాలు అందజేస్తామని తెలిపారు. ఎంఈఓలు జానకీరాం, మల్లయ్య పాల్గొన్నారు.

సీతారామపురం: మండల విద్యావనరుల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలపై కంటివైద్య నిపుణులు డాక్టర్ సాహితి అవగాహన కల్పించారు. ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు వచ్చే నెల నుంచి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఏమైనా దృష్టి లోపాలు ఉంటే ముందుగా గుర్తించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరు పాళెం వద్ద ఉన్న 132కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ఏఈ మన్మథరావు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆత్మకూరులో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇష్టకామేశ్వరీదేవికి విశేష పూజలు

సీతారామపురం: మండలంలోని ప్రాచీన శైవక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరంలో కొలువైన ఇష్టకామేశ్వరీదేవికి ఆషాఢ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి


మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి: ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి అజయ్‌కుమార్ కోరారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరి దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఉదయగిరి వైద్యశాలలోని ఇద్దరు వైద్యులు డిప్యుటేషన్‌పై వెళ్లినా వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో రోగులకు మెరుగైన సేవలు అందడంలేదన్నారు. వైద్యశాలలో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఉదయగిరి–నందవరం, ఉదయగిరి–బండగానిపల్లి రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రయాణికుల కష్టాలు తీర్చాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, పరుద్దీన్‌బాషా, కామాక్షమ్మ, పందిళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


సోమశిల: చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



కావలి: విశ్రాంత సైనికుల ఆధ్వర్యంలో ర్యాలీ

కావలి : కావలి విశ్రాంత సైనికుల సంఘం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు బీవీ రాజారావు నాయకత్వంలో బీపీఎస్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో గాయపడిన సైనికుడు మారుబోయిన యానాదిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యానాది మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో వివిధ రెజిమెంట్లకు చెందిన 587 మంది సైనికులు ప్రాణత్యాగం చేసి దేశానికి విజయాన్ని అందించారని గుర్తుచేశారు. తాను సైతం యుద్ధంలో గాయపడి నెలరోజులు కోమాలో ఉన్నానని తెలిపారు. ఉగ్రవాదుల ముసుగులో పాకిస్తాన్ సైనికులు కార్గిల్ శిఖరాలపైకి చేరి బంకర్లు ఏర్పాటు చేసుకుని ఉన్నా అత్యంత సాహసంతో మన సైన్యం వారిని తరిమికొట్టి జూలై 26న టైగర్ హిల్స్‌పై మన జాతీయ పతాకాన్ని ఎగురవేసిందని తెలిపారు. కార్గిల్ విజయాన్ని స్మరించుకుంటూ ఏటా కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకొంటున్నట్లు వివరించారు. పూర్వ సైనిక సేవా పరిషత్ కావలి శాఖ కన్వీనర్ డీ రవిప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన తరువాత పాకిస్తాన్‌తో రెండు సార్లు, చైనాతో ఒకసారి జరిగిన యుద్ధాల్లో మనదేశం సాంకేతికంగా విజయం సాధించినా, దౌత్యపరమైన లోపాల వలన యుద్ధ ఫలితాలు నిరాశ పరిచాయన్నారు. కార్గిల్ యుద్ధ సమయంలో అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయి అన్ని దేశాల మద్దతు కూడగట్టి పాకిస్తాన్‌పై దౌత్యపరంగా కూడా విజయం సాధించి మన భూభాగాలని కాపాడారని వివరించారు. విశ్రాంత సైనికుల సంఘం అధ్యక్షుడు రాజారావు మాట్లాడుతూ విశ్రాంత సైనికుల భవనం కేంద్రంగా యువత, విద్యార్థుల్లో దేశభక్తిని రగిలించే కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. పూర్వ సైనిక్ సేవా పరిషత్ ప్రతినిధి జమున, రెడ్‌క్రాస్ సిబ్బంది, రోటరీ క్లబ్ ప్రతినిధులు స్వర్ణలత, సలీమ్ బేగ్, గోపీకృష్ణ, మాజీ సైనికులు బీవీ రాజారావు, యానాది, కోటేశ్వరరావు, సురేంద్రకుమార్, రహీమ్‌బాషా, జాన్,శ్రీనివాసులు, సాలామన్, సతీష్‌బాబు, వెంకటేశ్వర్లు, వెంకటరమయ్య, రమణయ్య, చిట్టిబాబు, నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగం చిరస్మరణీయం

సోమశిల: కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు విజయం సాధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ అమరవీరులకు నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల త్యాగం చిరస్మరణీయమన్నారు. ఉపాధ్యాయులు రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి, మాధవి, శివకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తోట శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు పీవీ రత్నం ఉన్నారు.

విద్యార్థి మృతిపై సంతాపం

ఆత్మకూరు: నెల్లూరులోని కేఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్లాబ్ కూలి గురుమహేంద్ర అనే విద్యార్థి మృతి చెందడం దురదృష్టకరమని జిల్లా ఎస్సీ,ఎస్టీ ప్రొటెక్ట్ కౌన్సిల్ అధ్యక్షుడు శేషం సుదర్శన్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. బాధిత విద్యార్థి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నేడు పెంచలస్వామి ఆరాధన

ఆత్మకూరురూరల్: మండలంలోని దేపూరులో హనుమాన్ భక్త పెంచలస్వామి 34వ ఆరాధన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నాయుడు భాస్కర్ నాయుడు, నాయుడు పెంచలనాయుడు శుక్రవారం తెలిపారు. వేకువన ఐదు గంటలకు సుప్రభాత సేవ, పెంచలస్వామి సమాధి వద్ద విశేషాభిషేకాలు, పూజలు, ఆంజనేయస్వామికి అష్టోత్తర శతనామావళి, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం తమలపాకుల పూజ, రాత్రి అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అర్ధరాత్రి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ శనివారం పరిశీలించారు. ఆధార్ కేంద్రం సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు. నియోగదారులు సహకరించాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి రాజేష్

ఆత్మకూరు: సచివాలయ ఉద్యోగులు, రాజ్యాంగ చట్టాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని, సచివాలయాలకు వచ్చే ప్రజలకు సేవాదృక్పథంతో సేవలు అందించాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ రాజేష్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో మండల న్యాయసేవాధికార సంస్థ సహకారంతో న్యాయవిజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం రావడం అదృష్టమని, ఈ అవకాశాన్ని ప్రజలకు సేవలు అందించేందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే సమయంలో తమ కుటుంబాల గురించి ఆలోచన చేయాలన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మున్సిపల్ ఆర్ఐ సయ్యద్ ఖాసీం, ఏఈలు జూపల్లి ప్రసాద్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం


సోమశిల:వరిని పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసచక్రవర్తి


వేరుకుళ్లు సోకిన బత్తాయి చెట్లును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి జయశ్రీ

ఉదయగిరి: పండ్ల తోటలకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన శాఖ అధికారిణి జయశ్రీ సూచించారు. ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లోని సోమలరేగడ, వెంకటంపేట గ్రామాల్లో సాగుచేస్తున్న బత్తాయి, మామిడి, డ్రాగన్ ఫ్రూట్ తోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. రైతులకు పండ్ల తోటలను ఆశించే తెగుళ్లు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. వేరుకుళ్లు తెగులతో చెట్లు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెట్లకు సరైన సమయంలో సూక్ష్మపోషకాలు అందిస్తే మంచి ఎదుగుదలతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆమె వెంట వీహెచ్ఏ భరత్ ఉన్నారు.

మినుము పంట పరిశీలన

నేలటూరులో సాగు చేసిన మినుము పంటను ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి శుక్రవారం పరిశీలించారు. పంటకు ఎల్లోమెంజాయిక్ వైరస్ సోకినట్లు గుర్తించారు. తెగులు నివారణకు లీటరు నీటికి 0.5 గ్రాముల అసటామాప్రైడ్ పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఓ ఆంజనేయులునాయక్, ఏఈఓ రాజశేఖర్‌రెడ్డి, వీఏఏ స్రవంతి ఉన్నారు.

సోమశిల: రేవూరులో సాగుచేసిన వరి పంటను ఏఓ శ్రీనివాసచక్రవర్తి శుక్రవారం పరిశీలించారు. రైతులకు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పైరు పిలక దశలో ఉందని, ఈ దశలో నత్రజని అధికంగా వాడడం వల్ల తెగుళ్లు సోకే అవకాశం ఉందన్నారు. మోతాదు మేరకే ఎరువులు వాడాలని సూచించారు. నత్రజని 30 నుంచి 35 కేజీలు యూరియా రూపంలో, పొటాష్ 17 నుంచి 20 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో వాడితే సరిపోతుందని తెలిపారు. 20 రోజుల వ్యవధిలో రెండుసార్లు వాడాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులు వాడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆయన వెంట వీఏఏ లక్ష్మి ఉన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వినతి

ఉదయగిరి: పట్టణంలోని రైతుసేవా కేంద్రం–1లో ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారదన్నారు. డ్రైనేజీల్లో పూడిక తొలగించక మురుగు వీధుల్లో ప్రవహిస్తోందన్నారు. వీధిదీపాలు సైతం వెలగడం లేదన్నారు. మార్కెట్ ఉన్నా కూరగాయలు, చేపలు ఆరుబయటే విక్రయిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. జనసంచారం ఉన్న ప్రదేశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు అవస్థ పడుతున్నారన్నారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, హెచ్ఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: దేపూరు, కనుపూరుపల్లి, నల్లపరెడ్డిపల్లి, పమిడిపాడు, వెన్నవాడ గ్రామాల్లో ఓడీఎఫ్ ప్లస్, జల్‌జీవన్ మిషన్‌పై గ్రామసభలు నిర్వహించారు. తాగునీటి నిర్వహణ, పారిశుధ్యం అమలు, తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం మహిళలకు బుట్టలు పంపిణీ చేశారు. వైస్ఎంపీపీ కంభంశెట్టి ప్రమీల, సర్పంచ్‌లు జగన్నాథం లక్ష్మమ్మ పాల్గొన్నారు.